
# ఇంకెంత మూల్యం చెల్లిస్తాం?

కె.బాలగోపాల్

జమ్మూలో భారతీయ జనతా పార్టీ నిప్పుతో చెలగాటం ఆడుతున్నదని చాలా మంది విమర్శిస్తున్నారు. మంటలు మండాలని కోరుకునే వాళ్లు నిప్పుతోనే చెలగాటం ఆడుతారు, నీళ్లతో కాదు. 1953లో షేక్ అబ్దుల్లా అక్రమ బర్తరఫ్‌కు, అక్రమ అరెస్ట్‌కు దారితీసిన ఆనాటి జనసంఘ్ నినాదాన్ని ఎల్.కె. అద్వానీ ఇవ్వాళ జ్ఞాపకం చేసుకుంటున్నాడంటే అన్నీ తెలిసే ఆ పని చేస్తున్నాడు. తన చంచల స్వభావాన్ని రాజకీయ ప్రతిష్ఠ చాటున దాచి యోగ్యుడయిన పాలకుడిగా, ప్రజాతంత్రవాదిగా చలామణి అయిన జవహర్‌లాల్ నెహ్రూ ఆనాడు ఆ ఒత్తిడికి తలఒగ్గి అబ్దుల్లాను నిర్బంధించి నిప్పు రాజేసాడు! ఇవ్వాళ ఆయన వారసులే కదా దేశాన్ని పరిపాలిస్తున్నది!

జమ్మూలో మార్కెట్లు బంద్ పెడితే 'మా ఆపిల్ పండ్లను ముజఫరాబాద్‌కు తీసుకపోయి అమ్ముకుంటాం' అని కాశ్మీరీ రైతులు వర్తకులు అనడం, హురియత్ నాయకులే కాక ఇతర రాజకీయ నాయకులు కూడ వారికి మద్దతు ఇవ్వడం చాలామందికి ఆగ్రహం కలిగించి ఉంటుంది. చూశావా, ఇండియాలో అమ్ముకోనీయకపోతే పాకిస్థాన్‌కు పోయి అమ్ముకుంటాం అంటున్నారు అనుకొని ఉంటారు. కానీ అదే అనదలచుకున్నా, సౌలభ్యాన్నే ప్రమాణంగా పెట్టుకున్నా, ముజఫరాబాద్ కాదు రావల్పిండికి పోతాం అందురు. కాశ్మీర్ లోయలో ఎక్కడి నుండయినా, ఏ సీజన్‌లోనయినా రావల్పిండికి పోయి నంత సులభంగా ముజఫరాబాద్‌కు పోలేరు. జమ్మూకు అసలే పోలేరు. అయినప్పటికీ ముజఫరాబాద్‌కు పోయి అమ్ముకుంటాం అన్నారంటే కారణం శ్రీనగర్–ముజఫరాబాద్ రోడ్డు ఈ మధ్య పునరుద్ధరించారన్న దొక్కటే కాదు. రోడ్డు పునరుద్ధరించారు గానీ అనుమతిపత్రాలూ వీసాలూ రద్దు చేయలేదు. రావల్పిండి రోడ్డు అధికారికంగా పునరుద్ధరించలేదు గానీ పోదలచుకుంటే అసాధ్యమేం కాదు. కానీ ముజఫరాబాద్ అవిభక్త కాశ్మీర్‌లోని పట్టణం. శ్రీనగర్ తరువాత రెండవ పెద్ద పట్టణం. కాశ్మీరీలు చెప్పదలచుకుంది, మీరు జమ్మూలో అమ్ముకోనీయకపోతే మా కాశ్మీర్‌లోనే మరో పెద్ద మార్కెట్ ఉంది, అక్కడికి పోయి అమ్ముకుంటాం అని. ఈ తేడా ఇండియాలో ఎంతమందికి అర్థం అవుతుంది? ఈ తేడాయే కాదు, కాశ్మీరీలకు సంబంధించిన ఏ వాస్తవాన్నయినా అర్థం చేసుకోవడానికి బయటి రాష్ట్రాలలో ఎంతమంది సిద్ధంగా ఉన్నారన్నది అనుమానమే. కులం, ప్రాంతం, భాష, జాతి ప్రాతిపదికల పైన నడుస్తున్న 'గుర్తింపు' ఉద్యమాలు లేక 'అస్తిత్వ' ఉద్యమాలు ఇప్పుడనేకం ఉన్నాయి. వాటి ఆకాంక్షలలోనూ ఆరాటంలోనూ న్యాయం ఉందని గుర్తించినా కూడా వాటిలోని పరద్వేషం తరుచుగా ఇబ్బంది పెడుతుంది. వాటిపట్ల సానుభూతిగల వాళ్లను కూడ దూరం ఉంచుతుంది. ఈ అస్తిత్వ ఉద్యమాలు లేక ఆరాటాలన్నిటిలోకి కాశ్మీరీల పోరాటంలో పరద్వేషం తక్కువ అంటే ఎంతమంది నమ్ముతారో! కానీ ఇది నిజం. భయోత్పాతం కల్గించడం, ద్వేషాల్ని రెచ్చగొట్టడం లక్ష్యంగా గల మిలిటెంట్లు పర్యాటకులపైన కాల్పులు జరిపి చంపిన ఉదంతాలూ, బీహార్ నుంచి పోయి కూలిచేసుకుంటున్నవారిని చంపిన ఘటనలూ జరిగిన మాట వాస్తవమేగానీ, సాధారణ కాశ్మీరీలలో కాశ్మీరీ జాతీయ భావం ఎంత ప్రబలమైనదో పరద్వేషం అంత బలహీనమైన లక్షణం. లేకపోతే మిలిటెన్సీ కొంత వెనుకడుగు వేయగానే ఏటా లక్షల సంఖ్యలో పర్యాటకులు కాశ్మీర్‌కు పోయిరావడం జరిగేది కాదు.

మిలిటెన్సీ మొదలయిన తొలినాళ్లలోనే కాశ్మీర్‌లో హిందూ దేవాలయాలను కూల్చేశారన్న వదంతి బలంగా వ్యాపించింది. అదృష్టవశాత్తు భారత మీడియా దీని నిజానిజాలు తేల్చే బాధ్యత మీద వేసుకొని పరిశోధన జరపబట్టి అది పూర్తిగా అవాస్తవం అని తేలిందిగానీ లేకుంటే ఆ మచ్చ నిలిచిపోయేదే. గండర్‌బల్ తాలూకాలో తుల్ముల్లా అనే గ్రామం ఉంది. అక్కడ భవానీ గుడి ఉంది. ఆమెను క్షీర్ భవాని అంటారు. సంవత్సరానికొక రోజు ఆమెకు పాలతో అభిషేకం చేస్తారు.



1997 ఫిబ్రవరి 16వ తేదీన ఆ గ్రామానికి చెందిన ఒక టీచర్‌నూ, టైలర్‌నూ భారత సైన్యం కొట్టి చంపింది. ఆ ఊరి ప్రజలు మరుసటిరోజు పెద్ద ప్రదర్శన జరిపారు. ఆందోళన చేశారు. ఆ ఆగ్రహంలో భాగంగా భవాని గుడిపైన దాడి చేస్తారని లేక చేస్తారన్న భయంతో ప్రభుత్వం ఆ గుడికి భద్రత బాగా పెంచుతుందని బయటివారు అనుకోనడం సహజం. కానీ ఘటన జరిగిన కొద్దిరోజుల తర్వాత తుల్ముల్లాకు వెళ్లిన మానవహక్కుల బృందానికి కనిపించిన దృశ్యమేమిటంటే గుడి బయట చేత లాఠీ పట్టుకున్న ఒక కానిస్టేబుల్ మాత్రమే ఉన్నాడు. సైన్యం కొట్టి చంపిన వారి విషయం గ్రామస్తులతో మాట్లాడిన తరువాత గుడి ఎక్కడుందో చూపించమంటే స్నేహ పూర్వకంగా వెంట వచ్చి ఆ గుడి ప్రాచీనత గురించి, ప్రశస్తి గురించి చెప్తూ చూపించారే తప్ప గుడి చూస్తామని అడిగినందుకు నిరసన గానీ వ్యతిరేకత గానీ లేశమంత కూడ వ్యక్తం చేయలేదు. ఆ తరువాత జమ్మూలో తలదాచుకున్న పండిట్లు చెప్పిన విషయమేమిటంటే ప్రతి సంవత్సరం భవానీకి క్షీరాభిషేకం జరిగే పర్వదినాన వారు పెద్ద సంఖ్యలో తుల్ముల్లాకు వెళ్తూనే ఉన్నారని, ప్రభుత్వం నుంచి సహాయమే కాక గ్రామస్తుల నుంచి ఆదరణా వారి కెప్పుడూ దండిగా లభిస్తూనే ఉన్నదని. హిందువుల పూజల పట్ల, హైందవ మతం పట్ల ద్వేషంతోనే కాశ్మీరీలు అమర్‌నాథ్ యాత్రను నిర్వహించే సమితికి భూమిని లీజుకివ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారని చాలామంది అనుకుంటున్నారు కాబట్టి ఈ ఉదంతాన్ని ఉటంకించవలసి వచ్చింది. మరయితే 100 ఎకరాల అటవీ భూమి గురించి ఇంత రచ్చ ఎందుకు చేస్తున్నారు అని అడుగుతారు. వీళ్లయినా 100 ఎకరాల కోసం అంత మొండిగా ఎందుకు గొడవ పడాలని ఎదురు ప్రశ్న వేయవచ్చునుగానీ కాశ్మీరీల కోపాన్ని అర్థం చేసుకోవడానికి మరి కొన్ని వాస్తవాలు తెలుసుకుందాం.

అమర్‌నాథ్ యాత్ర కాజీగుండ్ వద్ద కాశ్మీర్‌లోయలోకి ప్రవేశించిన తరువాత దాదాపు రెండున్నర లేక మూడు గంటల సేపు ప్రయాణించి పహల్గాం చేరుకుంటుంది. అక్కడి నుంచి యాత్రికులు కాలినడకన లేక పశువుల పైన దర్శన స్థలానికి పోతారు. కాశ్మీరీల తిరుగుబాటు అత్యంత తీవ్ర స్థాయిలో ఉన్న రోజులలో కూడ ఈ యాత్ర ఆగలేదు. దానిని భారత సైన్యం తన ప్రతిష్ఠకు సవాలుగా తీసుకొని నిర్విఘ్నంగా సాగించుట మొక్కటే అందుకు కారణం కాదు. కాశ్మీరీలలో ఎక్కడా దాని పట్ల వ్యతరేకత, నిరసన లేక పోవడం కూడ కారణమే. ఆ యాత్రలో భక్తులే కాక సంఘ్ పరివార్ కార్యకర్తలు కూడ పాల్గొంటారు. వారు శివ భక్తి స్తోత్రాలే కాక కాశ్మీరీలను ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొడుతూ నినాదాలు కూడ చేస్తారు. 'కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఇండియా ఒకటే' అనేది ఒక మచ్చుతునక. దర్శన స్థలానికి సమీపంలోని అడవి ప్రాంతంలో మిలిటెంట్లు యాత్రికుల పైన కాల్పులు జరిపిన ఉదంతాలు ఉన్నాయి గానీ దారిలో ఎక్కడా స్థానిక ప్రజలు నిరసన గానీ వ్యతిరేకత గానీ తెలిపిన ఉదంతాలు లేవు. పహల్గామయితే యాత్ర జరిగే దినాలలో సగటు హైందవ జాతర స్థలంలాగే ఉంటుంది. బొట్లు, మాలలు, కాషాయ వస్త్రాలు వేసుకున్న భక్తులు వేల సంఖ్యలో దిగుతారు, తమ వంతు వచ్చే వరకు బస చేస్తారు, ఆ తరువాత పోయి దర్శనం చేసుకొస్తారు. మళ్లీ నినాదాలిచ్చుకుంటూ తిరుగు ప్రయాణం అవుతారు. పహల్గాంలోనూ ఆ తరువాతా వారికి కేవలం ప్రభుత్వం నుంచే కాక స్థానిక ప్రజలనుంచి కూడ చాలా సహకారం లభిస్తుంది. ఆదరణ లభిస్తుంది. ఇవ్వాళ లీజుకు ఇస్తామన్న 100 ఎకరాలు కొత్తగా ఇస్తున్నది కాదు, యాత్రికులు వాడుకొంటున్నదే మరి కొంత పెద్ద పరిమాణంలో, బహుశా శాశ్వత ధర్మ సత్రాల నిర్మాణం కోసం ఇస్తున్నది. శాశ్వత వసతుల ప్రస్తావన లేకుండ, లీజు గురించి మాట్లాడకుండ ఎప్పటిలాగే యాత్రికుల తాత్కాలిక అవసరాల కోసం ఆ పరిసరాలలోని అటవీ భూమిని వాడుకుంటే ఏ గొడవా జరిగేది కాదు. అవసరాన్ని బట్టి ఎప్పటికన్నా కొంచెం ఎక్కువ వాడుకున్నా గొడవ జరిగేది కాదు. ఈ గొడవంతా ముగిసి ఆవేశాలు చల్లారిన తరువాత జరగబోయేది అదే. ఇంకొన్ని రోజులలో మొదలు కాబోయే అమర్‌నాథ్ యాత్రను అద్వానీ గారూ, వారి సోదరులూ తమ సంకుచిత ప్రయోజనాల కోసం వాడుకోకుండ ఎప్పటిలాగ సాగనిస్తే మనం అదే చూడబోతాం గూడ. అయినప్పటికీ 100 ఎకరాల లీజును కాశ్మీరీలు ఇంతగా వ్యతిరేకించడానికి గల కారణం ఏమిటన్న ప్రశ్నకు జవాబు కావలసిందేనంటే, తమ ఉనికి పట్ల , తమ నేల పట్ల, తమ సంస్కృతి పట్ల వారికి ఉన్న ఉద్వేగభరితమైన బంధాన్ని కారణంగా చూపించవలసి ఉంటుంది. ఆ ఉద్విగ్నత తెలియని వారికది ఒక వెర్రిగా కనిపించవచ్చు. దానిని రెచ్చగొట్టి వాడుకోవడం రాజకీయ వేత్తలకు సులభం కావచ్చు. అయితే అందులో తమ జాతి గుర్తింపులో భాగమైన భౌతిక, సాంస్కృతిక అంశాల పట్ల తీవ్రమైన తాదాత్మ్య భావనే తప్ప పర ద్వేషం ఒకింత కూడ లేదు. అంతేకాక ఈ భావన ఎంత తీవ్రమైనదో వారి స్నేహశీలం అంతే బలీయమైనది. ఈ విషయాన్ని గుర్తించి రెండిటినీ గౌరవించడం నేర్చుకుంటే వారితో వ్యవహరించడం కష్టం కాదు. దీనికి అద్వానీ ఒప్పుకోడు. భారతీయత అనేదొక అఖండమైన భావన అనీ, దానిలోపల వేరే గుర్తింపులకూ భావోద్వేగాలకూ తావులేదనీ, ఆ భారతీయతతో మాకేమి సంబంధం అన్న ప్రశ్న లేవదీయడానికి వీలేలేదనీ ఆయన ప్రాపంచిక దృక్పథం చెప్తుంది. ఆ దృక్పథం అధికారానికి చేరువయిన క్రమంలో ఈ దేశం నుంచి చాలా మూల్యమే తీసుకుంది. అధికారం చలాయించిన కాలంలో మరింత తీసుకుంది. ఇంకా ఎంత తీసుకోనిస్తామనేది మనమంతా నిర్ణయించుకోవలసిన విషయం.


> భారతీయత అనేదొక అఖండమైన భావన
> అనీ దానిలోపల వేరే గుర్తింపులకూ
> భావోద్వేగాలకూ తావులేదనీ,
> ఆ భారతీయతతో మాకేమి సంబంధం
> అన్న ప్రశ్న లేవదీయడానికి వీలేలేదనీ
> అద్వానీ ప్రాపంచిక దృక్పథం చెప్తుంది.
> ఆ దృక్పథం ఈ దేశం నుంచి చాలా
> మూల్యమే తీసుకుంది. ఇంకా ఎంత
> తీసుకోనిస్తామనేది మనమంతా
> నిర్ణయించుకోవలసిన విషయం.